మనసు కథ

నాయని కృష్ణకుమారి



శ్రావణ మాసపు ఆకాశం మసక మసకగా ఉంది. రాత్రంతా చిత్తడి జల్లు కురిసి అప్పుడప్పుడే కాస్త విశ్రాంతి తీసుకుంటున్న నింగి ఏమీ ప్రసన్నంగా కనబడటంలేదు. కళ్ళు తెరుస్తూనే బయటి వాతావరణంలో ఉన్న బరువంతా తన గుండెలమీద చేరినట్లయి కళవరపడ్డాడు శ్రీధరమూర్తి. అలవాటుప్రకారం రెండు చేతులూ పైకి సాగదీసి ఒళ్ళు విరుచుకుని నటిమంచాన బాసింపట్టు పెట్టి కూర్చున్నాడు. మనసంతా తడిసి బరువెక్కిన చిగురుటాకులా కదిలిపోతోంది. సరిగ్గా మూడు నెల్లనుండీ ఈ తడి ఆరడం లేదు. ఈ బరువు తగ్గడంలేదు. ఎప్పుడు తాను ఆరిన రెక్కల్ని తేలిగ్గా గాలిలో ఆడిస్తూ స్వేచ్ఛగా ఈ లోకంలో విహరించగలడో తెలీడంలేదు. తనకు జీవితమంతా శ్రావణమాసమై పోతుందేమోనన్న భయంకూడా పట్టుకుంది మధ్య. శ్రావణమేఘాలన్నిటినీ మనస్సులోనూ కళ్ళల్లోనూ బంధించి లక్ష్మి తన్నిలా వేధిస్తోంది. తనమీద కోపం తెచ్చుకుని దూరంగా వెళ్ళిపోయిన తన లక్ష్మి !

మూర్తి లేచి దొడ్లో వేపపుల్ల విరుచుకున్నాడు. మనస్సులో కదిలే ఆలోచనల్తో సమానంగా నోట్లో వేపపుల్ల అటూ ఇటూ ఆడుతోంది. పొగ మబ్బులు పోరాడే ఆకాశంమీదికి వెలుగురేఖలు,

అప్పుడే ఎవరో చేతికొద్దీ విసిరేసిన పారి జాతపు పువ్వుల్లా పరుచుకుంటున్నాయ్. వాటి కాడల ఎర్రదనం లాగానే ఉదయ రాగం, కనీ కనపడనట్లు సర్దుకుంటు న్నది. శ్రీధరమూర్తి మనస్సులో మాత్రం ఎక్కడా వెలుగుతెరలు లేవు. లక్ష్మికి కోపం తగ్గేదెప్పుడు? కలకలా విరిసే ముఖంతో మళ్ళీ ఆవిడ తన చేతుల్లో వాలిపోయేదెప్పుడు? ఎప్పుడో వస్తుంది. ఈ మేఘాలు విచ్చుకుని ఇంత నడి శ్రావణదినాన సూర్యకాంతి మెల్లగా విరుస్తున్నట్లే తన లక్ష్మికూడా వస్తుంది. మూర్తిగబగబా మొహం కడుక్కున్నాడు పనిమనిషి హోటల్‌నుండి పట్టుకొచ్చిన కాఫీ పొగలు చిమ్ముతూంది. తన మన సంతా అటువంటి పొగలే! అనాలోచి తంగా కాఫీగ్లాసు పట్టుకోగానే చెయ్యి చుర్రుమన్నది. ఆ చురుకుదనం మెద డుకు తగిలి ఏవో జ్ఞాపకాలు బూదర బూదరగా మనసంతా అల్లుకోసాగినయ్. ఆ మసక తెరల మాటున రాధ! మన స్సును చురుకు దెబ్బలు కొట్టి, తన్ను నిబ్బరంగా నిలవనీయక, కొనవేలిచుట్టూ దారవుపోగుకు మల్లే తిప్పుకున్న రాధ! లక్ష్మిముఖంమీద ప్రయత్నపూర్వకం గానే కావిర్లు కమ్మించిన రాధ!

రాధ ఎంత తియ్యని స్మృతి! జన్మ కంతా సరిపడే ఆరాధనా భావాన్ని తనలో నింపి, తనది కావడానికి వీల్లే కుండా పోయిన రాధ!

"నీళ్ళు తోడానయ్యా!" పనిమనిషి కేకతో బయటి ప్రపంచంలోకి వచ్చాడు మూర్తి. బక్కెట్లో నీళ్ళు చాలా వేడిగా ఉన్నాయ్. వెచ్చటి ఆవిర్లు ఆ చిన్న బాత్రూము నిండా చుట్టుకుని, తన్నేదో కలల్లోకి గిరవాటు పెడ్తున్నట్లుగా అయి పోతున్నాడు. చేతిలో సబ్బు బిళ్ళ అరుగుతోంది. తన మనస్సు కూడా ఆలోచనల్తో అట్లాగే కరిగిపోతూ అలిసి పోయిన జంతువులా నురుగులు కక్కు తోంది. చిత్రమైన ఆ బాధ వెగటుగా తోచి 'రాధా' అంటూ అసహనంగా మనసులోనే గట్టిగా అరుచుకున్నాడు. మూర్తి ఆ కేకలో రాధమీది కోపంకంటే ఆ పేరు పెదాల మధ్య నిలవడంలో ఉన్న తియ్యదనం మనస్సుమీద వింత అనుభవాన్ని చిలుకుతోంది.

"లక్ష్మి, ఉత్త పసిపిల్ల రాధా! దాని మనస్సు పరిపక్వం కాలేదు. కాని నువ్వు మాత్రం చిన్నప్పటి రాధవు కావు. నీ ఆకర్షణ చిత్రంగా నాలో నిలిచిపోయే ట్లు చేశావు. ప్రయత్న పూర్వకంగానే నన్ను సుడిగుండంలోకి లాగేశావు. ఇలా ఎందుకు చేశావు రాధా? ఎందుకు?—" మూర్తి మనస్సు ఆక్రో శిస్తూనే ఉంది. బక్కెట్లో నీళ్ళన్నీ అయి పోయినయ్. నీళ్ళోడుతున్న తలా ఒళ్లూ తుడుచుకున్నాడు. చేతిలో ఉన్న టర్కీ టవల్ ఒంటితడిని సొంతం పీల్చక పోవడంమాట అటుంచి, మనస్సుకు

పట్టిన తడిఅలాగే ఉంది. అది ఇప్పట్లో ఇంకిపోయే దారి కనిపించడంలేదు.

బల్లమీద ఫ్త్రభంగా తోమి తళతళ లాడుతున్న ఇత్తడి క్యారేజి తెచ్చిపెట్టింది పనిమనిషి. ఆ తళతళలకు మల్లే లక్ష్మి రకరకాల వేషాలు వేసుకుని మనస్సులో అడపాదడపా కదలాడుతోంది. పరిణత హస్తుడైన శిల్పి మలచిన బొమ్మలాంటి లక్ష్మి, పువ్వులు విరిసి గాలికి అందంగా ఊగే సన్నజాజి తీగలాంటి లక్ష్మి! అందమనే మాటకే సృష్టికర్త రాసిన మహాభాష్యం లాంటి తన లక్ష్మి! ఆవిడ కూడా తన మనస్సు నింతగా రంపపు కోత కోసేంత సమర్థురాలెలా అయింది? మంచంమీదికి చేరి బాధగా కళ్లు రెండూ మూసుకున్నాడు మూర్తి. మనస్సును విశృంఖలంగా విహరించ మన్నట్లు వది లేశాడు. మనస్సు చకచకా గతం తవ్వు కుంటూ కలుగులోపలికి చొచ్చుకుపోయే చిట్టెలుకలా కదలాడుతోంది. గతంలో ఎన్నో బొమ్మలు! ఎన్నో నీడలు! అన్ని ట్లోనూ విరగబడి నవ్వుతూ రాధే కనిపి స్తోంది. రాధ వెనక లీలగా, నీడలాగా దిగులు కళ్ళతో లక్ష్మి! పసిపాప లాంటి తన లక్ష్మి!

ఆ వేళ రాధ తన ఇంటికి వచ్చింది. మూర్తి పెళ్ళయిన రెండేళ్ళలో ఇదే మొదటిసారి రాధ రావడం. అయిదేళ్ళ నుండీ నేర్చుకుంటున్న వైద్య విద్య ఆవిడకు హుందాతనాన్ని నేర్పింది. నిలకడను సమకూర్చింది. రాధ మాటల్లో ఎక్కడా తొట్రుపాటుతనం లేదు. కంటి పాపల్లో చురుకుదనపు ఛాయలు లేవు. ఒదులుగా వేసుకున్న బారెడు జడ, పచ్చగా మెరిసే బుగ్గలు, చకచకలాడే కళ్ళు, కొసతేలిన ముక్కు, ఆ అందాన్ని చూస్తూ చూస్తూ మూర్తి అయోమ యంలో పడిపోయాడు. అందం ఒకటే కాదు. అంతకుమించి ఆవిడ సమకూర్చు కున్న విద్య, సంస్కారం, తనలో నిద్రాణంగా ఉన్న ఆరాధనాభావాన్ని మేల్కొలిపింది. అయిదేళ్ళకిందట ఈ రాధనే చేసుకోమని అడిగాడు తన మేన మామ. అప్పుడు నచ్చని రాధ ఇప్పు డెంత హుందాగా ఉంది? ఒక్కక్షణంలో సగంసేపు మాత్రం ఈ రాధనేనా నేను కాదన్నది అన్నభావం మెరుపులా కొట్టింది. కాని ఇన్నాళ్లూ తన ప్రాణంగా భావించిన లక్ష్మి మాటేమిటి? ఆవిడకు తప్ప మరో ఆడదానికి తన మనస్సులో చోటు ఉండడానికి వీలేలేదు.

"ఏం బావా! చూపుల్తో తినేయ దలచుకున్నావేమిటి?" రాధ నవ్వుతూ పలకరించింది.

"మీ ఆయన్ని దయదలచి ఒదిలేశాను లక్ష్మి! నేనే తల్చుకునుంటే నీ కితనితో పెళ్ళయ్యేదా! నన్ను చేసుకోమని మా నాన్న అడిగితే వద్దన్నాడట మనుడు. పోనీలే తగిన భార్య దొరికింది. అంత

వరకూ మా బావ అదృష్టమే," అన్నది, నవ్వుతూ మరోసారి.

"నిజమే. మేం పుట్టినప్పటినుంచీ మొగుడు పెళ్ళాలనే పిలిచేవాళ్లు. ఆవిడ పుణ్యమా అని ఒదిలిపెట్టింది గాని, లేక పోతే వేగలేక చచ్చేవాణ్ణి:" తానూ ఆ నవ్వుతో శ్రుతి కలిపాడు.

ఆవేళ ఒంటరిగా దొరికించుకుని దులిపిపోసింది లక్ష్మి.

"ఏమిటండీ మీ ఇద్దరి వరసా! అది చదువుకున్న వాళ్ళమన్న అహమా! లేక ఎట్లామాట్లాడినా చెల్లుతుందన్న ధీమానా" అని మాటల్ని బాణాలుచేసి విసిరింది. ఆ ఎగరడంలో తనమీద కోపం కంటే రాధమీది అసూయా, సందేహం, ఎక్కువగా కనిపించి తన్ను చకితుణ్ణి చేశాయి. లక్ష్మిని రాధ ఆధిక్యం అంతగా రెచ్చగొట్టింది.

అప్పటినుండీ తను లక్ష్మి ముఖంలో నవ్వు చూడలేదు. తుమ్మల్లో పొద్దుకూకినట్లు మలినంగా చిటపటలాడుతూ అంటీ పట్టనట్టు తిరిగే లక్ష్మి తనలో కోపాన్నే పెంచింది.

మరీ అంతగా మాలకాకిలా ఉండ మంటుందేమిటి? ఏం? మేనమరదల్తో పరాచికాలాడితే తప్పా! నన్నేంగుంజకు కట్టేసే పశువనుకుంటుందా! అని మనస్సులోనే ఎగిరిపడ్డాడు. ఈ రాధనే ఆధారంగా చేసుకుని ఉడుకుబోతు లక్ష్మి గర్వపాతం చెయిదామనుకున్నాడు.

కాని జరిగిందేమిటి? పాఠం రాధే! చెప్పింది తనకు. నిలుచున్నా, కూచున్నా ఏ పనిచేస్తున్నా, కన్నెత్తి తనవైపుకు చూడకుండానే రాధ చిత్రంగా అయస్కాంతంలా తన్ను ఆకర్షించసాగింది! ఆవిడ మాట, నవ్వు, నడక చివరకు కొనవేలి చిరుకదలికయినా తన గుండెల్ని చిత్రంగా స్పందింపజేసే సామర్థ్యాన్ని సంతరించుకున్నాయి. రాధ ఎదుట లేక పోయినా చుట్టూ ఉన్న గాలి, గాలిలో తేలే శబ్దమూ, నిలువెల్లా రాధనే నింపుకొని, తనకు అందిస్తున్నట్లుగా అనుభూతి చెందేవాడు. రాత్రివేళ పక్కనున్న లక్ష్మిని తాకకుండానే ఇది రాధే, ముమ్మాటికీ రాధే అయితే, అన్న ఊహకు ఊపిరిపోసేవాడు.

"అవును తప్పా! నేను రాధను ప్రేమిస్తున్నాను. అందమైన ప్రతి వస్తువునూ ఆరాధించే హక్కు అందరికీ ఉండాలి. ఆలయంలో ప్రతిమలాంటిదే రాధ. ఆవిడ శరీరంమీద నాకు మోజు లేదు ఆవిడ్ని చేత్తో తాకడానికయినా నేను సాహసించలేను. ఇది నా లక్ష్మికి ద్రోహం చెయ్యడం ఎంతమాత్రంకాదు" అని మనస్సును జోకొట్టే" ప్రయత్నం చేసేవాడు.

అనుక్షణమూ తన మనస్సునిండా మెరుపులు మెరిపిస్తూ, ఓడిపోతున్న శత్రువునుచూచి విజయ గర్వంతో విర్రవీగే నాయకురాలిలా రాధ! తన ఆకర్ష



జను సుడులుతిప్పి, సన్నని జలతారు వలలా, తనమీదికి ప్రయత్నపూర్వకం గానే విసిరేసిన రాధ! తను గిలగిల్లాడి పోయాడు. లక్ష్మి పుట్టింటికి ప్రయాణ సన్నాహం చేయసాగింది.

"ఏమిటి లక్ష్మి నీ మూర్ఖం! నన్ను సాధిద్దామనా?" మందలించబోయాడు. కాని ఆ మందలింపులో బలం లేదని తనకు బాగా తెలుసు. తన మనస్సులో చకచకా మెరిసే రాధ బొమ్మ ముందు ఒకప్పుడు తాను మెచ్చి మురిసిపోయిన భార్య కేవలం పిండిబొమ్మలాగా పేల వంగా కనిపిస్తోంది. ఆ విషయాన్ని అంతులేని బాధతోనే గుర్తించాడు తను.

"మరేమీ చెప్పకండి నాకు! మరో స్త్రీ నీడయినా మీమీద సోకడం నేను సహించలేనని మీకు తెలుసు. అటువం టప్పుడు, దాన్ని మీరే ప్రోత్సహిస్తుంటే అది నా కవమానం కాదా! మీకు కష్టంగా ఉన్నాసరే, జరుగుతున్న ఈ నాటకం చూడకుండా పారిపోకపోతే నిజంగా నాకు పిచ్చెక్కుతుంది." తీవ్రంగా పడగ విప్పిన నాగుబాములా బుసలుకొట్టింది లక్ష్మి. ఉగ్ర సుందరమైన ఆ రూపాన్ని నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు మూర్తి.

లక్ష్మి వెళ్ళిపోయింది. రాధకూడా వెంటనే ప్రయాణం కట్టింది. తాను

అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న లక్ష్మి తన బలహీనతను సానుభూతితో అర్థం చేసుకోలేకపోయింది. ఒకప్పుడు ఎటు వంటి ఆకర్షణనూ తనలో పెంచలేని రాధ తన్ను పిచ్చివాణ్ణి చేయగలనని నిరూపించింది. ఎందుకిలా చేసింది రాధ! ఏదో కసి పెట్టుకున్నట్లు ఎందు కీ చెల గాటం ఆడింది? తనను పొందే దారేలేని బ్రతుకంతా నిస్సారమనే భావాన్ని బలంగా తనలో ఎందుకు సృష్టించింది? ఏనాటికైనా తా నా భావాన్ని అధిగమించ లేకపోతే ఈ జీవితాన్ని ఎలా కడతేర్చ గలడని!

అయోమయంగా కళ్ళు తెరిచాడు మూర్తి! టేబిల్ మీద పనిమనిషి పెట్టి పోయిన కారియర్ వెక్కిరిస్తోంది. గిన్నెలు విప్పుకున్నాడు. అన్నం చల్లగా [illegible]గంలా తగిలింది. ఏలాంటి వెచ్చ దనమూ లేక గడ్డకట్టుకుపోయిన తన బ్రతుకులాగే! కళ్ళవెంట నీళ్ళు తిరి గాయి మూర్తికి. రాధ ఆకర్షణనుండి బయటపడడం ఎట్లా? లక్ష్మిని ప్రసన్ను రాలిని చేసుకోవడం ఎట్లా? ఈ బాధను ఎవరికి చెప్పుకోవడం? ఒక్కచోట తిని ఒక్కచోట పెరిగిన రాధకే చెప్పుకుంటే ఈ బాధ తీరుతుందా? అంతులేని ఆకర్ష ణను తనలో పెంచగలిగిన ఆవిడకే తన్ను అర్థంచేసుకోగల శక్తికూడా ఉండి ఉండాలి తప్పదు.

తినడమైందనిపించి గబగబా చేతులు కడుక్కున్నాడు. మనస్సును పట్టి విడ వని దిగులుకుమల్లే చేతినిండా జిడ్డు. అట్లా ఓ కాగితమూ కలమూ అందు కున్నాడు మూర్తి.

"రాధా!

ఆశీస్సులు. నువ్వు నాలో సృష్టిం చిన సంఘర్షణకు తట్టుకోలేకే నీ కీ ఉత్తరం వ్రాస్తున్నాను. నువ్వంటే మొదటినుండీ నాకు చాలా యిష్టం. ఇష్ట మంటే ప్రేమ అనికూడా అర్థమా? మనుషుల్ని అంటిపెట్టుకునున్న అనుబంధ వలయంలో ఇష్టమూ ప్రేమా అనే రెండు బిందువులూ ఏ పరిస్థితుల్లో ఒక్కటై, కేంద్రంగా భాసిస్తాయో గుర్తుపట్టే స్తోమత నాకు లేదు రాధా! నిన్ను నా కిస్తానని మామయ్య అన్నప్పుడు నిజంగానే తిరస్కరించాను నేను. ఒకే కంచంలో తిని ఒకచోట తిరిగినవాళ్ళం అవడమే ఆ తిరస్కారానికి కారణమై ఉండవచ్చు. లేదా మరీ కటిక నిజం చెప్పాలంటే, రోజూ కళ్ళముందు మెసిలే నీకంటే అందమైందీ, అధికురాలూ భార్యగా రావచ్చుననే ఆశవల్ల కావచ్చు. ఇంతకూ ఆనాడు నా తిరస్కారం నిన్నేమీ బాధ పెట్టలేదని నాకు తెలుసు. కాని ఆనాడు నాలో పెరిగిన దృఢమైన అభిప్రాయాలు ఇప్పుడు మంచులా కరిగిపోవడానికి ఏమిటి కారణం? నీ మీద చిన్నప్పటి నుండీ ఉన్న ఇష్టం, కేవలం ఇష్టంగానే ఉండిపోకుండా, ఈనాటికి వేరువిధంగా

తిరిగిపోవడం ఎందువల్ల ? ఇందుకు కేవలం నాదేకాక నీ బాధ్యతకూడా ఎంత ఉంది రాధా ! ఇలా సాహసించి నీకు వ్రాస్తున్నందుకు నన్ను మన్నించు. చిన్ననాడు నీతో కలిసి బతికిన చెలిమి బలిమి నన్నిలా రాయడానికి ప్రోత్సహిస్తున్నది. తప్పుచేసిననాడు మొట్టికాయలు మొట్టి, పెద్దవాళ్ళతో చెప్పి, తన్నించిన కరుకుదనంతోనే ఈ ఉత్తరాన్ని విమర్శించు. నన్ను శిక్షించు. కాని నా హృదయం నీ ముందు విప్పకుండా మాత్రం ఉండలేను.

లక్ష్మి ఎంత అందమైందో, అంత తొందరపాటు మనిషి. ఆవిడ ప్రేమ ఒకప్పుడు ముగ్ధమోహనంగా ఉన్నా మరొకప్పుడు ప్రాణాంతకంగా ఉంటుంది. నా వైపు మరో స్త్రీ కన్నెత్తి చూచినా నేను మరో ఆడమనిషిని వాంఛతో చూచినా ఆవిడ సహించలేదనుకుంటాను. నీవు మర్నాడు వస్తావనగా నాకూ లక్ష్మికీ మధ్య నో వాగ్వాదం రేగింది. ఆ రోజేదో తెలుగు సినిమా చూచి వచ్చాం

'ఉత్త చెత్త సినిమా ! హీరో సెంట్ పర్సంటూ దద్దమ్మ' అని అడగకుండానే అభిప్రాయం అందించింది. నేను నిజానికి ఆ సినిమా ఎంతో బాగుందనుకుంటున్నాను. 'అదేం ? హీరో కారక్టరైజేషన్ చాలా బాగుందనుకుంటున్నానే !' అన్నాను.

'ఉండదు మరీ ! మీరూ ఆ హీరో ఒక మూసలో పోసిన వాళ్ళయితే !' అన్నది నవ్వుతూనే. ఆ నవ్వెందుకో నాకసలు అర్థం కాలేదు.

'మాట్లాడరేం ? కోపమా ! లేకపోతే ఏమిటండీ ! భార్యమీద అపోహ కలిగిన మగవాడు ఆ అపోహలో ఉన్న నిజానిజాల్ని తెలుసుకునే ప్రయత్నమన్నా చెయ్యాలి, లేదా దాన్ని నిజంగానే స్వీకరించి అసూయతో మండిపోతూ ఆవిణ్ణి దండించనైనా దండించాలి. అంతేకాని, పోనీలెమ్మని ఆవిడ మానానికి ఆవిణ్ణి వదిలేసి, 'నీ సుఖమే నే కోరుతున్నా !' అని పాడుకుంటూ అడవులా అఘంతరాలూ తిరుగుతాడా !" అన్నది.

నేనేం మాట్లాడేది ?

'మరేమీ అనుకోకుండా ఉంటే నేనో మాట అడుగుతాను. బహుశా ఆ సినిమా హీరోయిన్‌ను నేనే అయితే తర్వాత కథ హీరోగా మీ రెట్లా నడుపుతారు !' అన్నది.

"ఏవిటా దొంకతిరుగుడు ప్రశ్న. నీకసలా కథలో ఉన్న మౌలిక తత్త్వం అర్థంకాలేదు. అందులో హీరో అపోహ పడడమన్న ప్రశ్నేలేదు. వాళ్ళిద్దరూ ఒకరి ప్రాణం ఒకరుగా మెలిగేవాళ్ళు. తాను ప్రేమించిన స్త్రీ, తాను పెళ్ళాడిన స్త్రీ, తానంటే ప్రేమపోయి మరో మగాణ్ణి కోరుకుంటుంటే ప్రేమించిన మగవాడు స్వార్థాన్ని అవతలకు నెట్టి అడ్డు తొలగి

పోవడం దోషమా! అంతమాత్రాన ప్రేమ నశించిపోతుందా! అది కేవలం రెండో మనిషి అభిప్రాయం మారినందు వల్ల రంగులు మార్చుకోదు. ఆ పనే చేశాడు సినిమాలో హీరో," అన్నాను నేను.

"చాల్లెండి! అవతల మనిషి ప్రేమ కూడా తన ప్రేమలా గాఢమైందయితే తప్ప ఇద్దరిమధ్యా ఒకేరకమైన ఆరాధన ఉండదు. తాను ఆరాధిస్తున్న మనిషి మరో మనిషిమీద మోజు నిలిపితే ఇక ఆ ప్రేమకు అర్థం ఏమిటి? అది అక్కడికి నశించిపోవలసిందే. లేదా దానికి ఆశ్రయభూతులైన ఇద్దర్నీ మండించి మసిచెయ్యవలసిందే. ప్రతీకార వాంఛలేని ప్రేమ, ప్రేమ ఎట్లా అనిపించుకుంటుంది? మీరు నిజంగా చెప్పండి. తప్పించుకోవద్దు. మీరే ఆ హీరో అయితే ఏంచేస్తారు?" రెట్టించి అడిగింది.

నేను బెదిరిపోయాను రాధా! భయం భయంగానే తగ్గుస్థాయిలో, "నిజం చెప్పనా! నువ్వు నన్ను కాదని మరొకర్ని కోరుకుంటే నిన్ను నిందించను. దండించను. నా దురదృష్టాన్ని తిట్టుకుంటూ నీ దారికే అడ్డులేకుండా పోతాను"— అన్నాను. 'ఛీ' అన్నంత తీవ్రంగా చూచింది లక్ష్మి. "అయితే నా అభిప్రాయంకూడా వినండి. నన్ను కాదని మీరు మరో వనిత నీడ తొక్కినా నేను సహించలేను. అది మీకు కష్టాన్ని కలిగించినా చలించను. అటువంటి పరిస్థితుల్లో నేను మిమ్మల్ని తిరిగి సంపాదించుకోలేకపోతే నేనే ఉండను," అంటూ విసురుగా సమాధానం చెప్పింది.

ఇది జరిగిన మర్నాడే నువ్వు వచ్చావు రాధా! బహుశా లక్ష్మి మాటల్లోని తీవ్రత ఆవిడ చేతల్లోకూడా ఉంటుందా లేదా అని నిన్ను ఆధారంగా చేసుకుని పరీక్షించాలనుకుని ఉంటాను. కాని ఆ పరీక్ష నాకే వికటించింది. నా చేష్టలకు నీ వైపు నుండి ప్రోద్బలం ఎందుకు వచ్చిందో నేను ఇప్పటికీ ఊహించలేకపోతున్నాను. నిజంగా నా మీద నీకు మమత ఉందని నమ్మమంటావా రాధా! అదే నిజమైతే, ఈ క్షణాన, నేనేం పోగొట్టుకుని దౌర్భాగ్యుణ్ణయ్యానో నీ కెట్లా స్పష్టం చెయ్యగలను? ఒద్దు, అది నిజంకాదని చెప్పు నన్ను క్షమించు. మొన్నటి నా ప్రవర్తనవల్ల నీ మనస్సు కల్లోలపడితే నిజంగానే నన్ను క్షమించు రాధా!

అసలీ ఉత్తరం నీ కెందుకు వ్రాస్తున్నానో నాకే తెలీదు. బహుశా లక్ష్మి అంటే నాకు గాఢమైన ప్రేమ అనే సంగతి నీకు స్పష్టం చేయదలచుకుని ఈ ఉత్తరం మొదలుపెట్టి ఉంటాను. మొన్న నాలుగు రోజులూ నీ పట్ల నా ప్రవర్తన తెచ్చిపెట్టుకున్నదనీ, అందుకో బలమైన కారణం వెనక ఉందని తెలియజేయాలనికూడా ఇలా వ్రాస్తున్నానేమో,



నా కం రాధా! నా జీవన ఏం. ఆవిడ ఎడబాటును సహించ లేక, ఉపశమనం కోరి నీ కీ ఉత్తరం వ్రాస్తున్నానా? లేక నీ పట్ల ఈ తీవ్రమైన ఆరాధన ఎట్లా పెరిగిందో అర్థంకాక, జవాబు కోరి ఇలా వ్రాస్తున్నానా? అంతా అయోమయంలో పడిపోతున్నాను నేను. నన్ను మన్నించు.

నీ చిన్ననాటి స్నేహితుడు
శ్రీధర్."

మళ్ళీ ఒకసారి చదువుకున్నాడు. ఏమిటీ ఉత్తరం? గుండె ఎవరికోసం అనుక్షణమూ స్పందిస్తూందో, వాళ్ళకు వ్రాయవలసిన పద్ధతి ఇదేనా! కాదు. అయినా ఇంతకంటే ఏం వ్రాయడాని కైనా స్వేచ్ఛలేదన్న విషయం తనకు పూర్తిగా తెలుసు. ఉత్తరం తాపీగా కవ రులో పెట్టి మడత అంచుల్ని నాలికతో తడిపి అంటించాడు. ఈ ఉత్తరం లక్ష్మి చూస్తే ఏమంటుంది? ఇల్లు నాలుగు వైపులా బెదురుగా పరకాయించాడు. లక్ష్మి ప్రతిచోటా నిలుచుని ఎర్రబారిన కళ్ళతో, అదురుతున్న పెదాలతో తన్ను జంకిస్తూనే ఉంది. రకరకాలుగా కనిపించే లక్ష్మి రూపాలతో నిండి ఇల్లంతా ఇరు కుగా ఊపిరి పీల్చడానికయినా వీలు లేనట్లుగా అనిపించింది. ఒళ్ళంతా చెమట పట్టి, ఇక భరించలేక చకచకా బయటికి నడిచాడు శ్రీధరమూర్తి.

2

ఉత్తరం ఆసాంతం చదువుకుంది రాధ. కళ్ళు నిండి రెప్పల్ని ముంచిన తడి లోపలి పాపల్ని మరీ మిలమిల లాడిస్తోంది. ఈ మూర్తి ఈ నాటికి తన హృదయంలో ఎంత చిత్రంగా చోటు చేసుకున్నాడు. తాను మొదటే ఇతణ్ణి గుర్తించిఉంటే! అప్పుడీ లక్ష్మి ఎవరో! చేతిలో కాగితాలు రెపరెపలాడుతున్నట్లు

మనస్సు అస్థిరంగా ఆలోచనల్లో సత మతమైపోసాగింది. కోపంగా, బిగించిన పెదాలతో, విసురుగా పుట్టింటికి ప్రయాణంకట్టిన లక్ష్మి రూపమే తన్ను వెంటాడసాగింది. బుద్ధిపూర్వకంగా తా నాడే నాటకంయొక్క ప్రభావమే లక్ష్మి ప్రవర్తనకు కారణమని తెలుసు. అయినా తాను లక్ష్మిమీద దయదలచలేక పోయింది. మూర్తిని కనికరించలేక పోయింది. తాను పన్నిన ఆకర్షణ వలయంలోకి గత్యంతరంలేక చేరిన ఈగలా మూర్తి కొట్టుకుంటుంటే తాను తమాషా చూచింది. ఎందుకని ? అతను చిన్ననాడు తన్ను కాదన్నాడన్న కించ తన అంతరాంతరాల్లో ఎక్కడో దాగి ఉందా ? అయినా తన భ్రమకాని ఈ మూర్తి ఏమవుతాడు తనకు ! అతన్ని తను ప్రేమిస్తుందా ! ఎందుకంత పట్టు దలతో అతన్ని వెంటాడింది ? చిన్న నాటి చెలిమి నెపంతో కళ్ళతో కవ్వించింది. మాటలు పెదవిదాటి రానీయ కుండానే భారతమంత అర్థాన్ని మూగ భాషలో స్పష్టంగా చాటింది. తన ఆకర్ష ణకు ఏ దారీ దొరకకుండా లొంగిపోయే మూర్తిని, తా నెందుకు జాలిదలచలేక పోయింది ? ఏం చేస్తే మాత్రం తనవా డవుతాడా ఈ మూర్తి ! ఆ మాత్రం ఇంగితం లేకపోయింది తనకు. ఇంత చేసినా చివరకు జరిగిందేమిటి ? లక్ష్మిని పరీక్షించాలన్న అతని ఊహకు, తాను కేవలం ఒక సాధనం మాత్రమే కాగలిగింది.

రాధ గుండెనిండా అశాంతి పెరిగి కన్నీరు, మూసిన రెప్పలనుండి ముత్యాల్లా కిందికి జారసాగింది. వెచ్చగా బుగ్గలమీదికి జారుతున్న ఆ స్పర్శ ప్రియుడి హస్త స్పర్శలా ఉప శమనం కలిగిస్తోంది. ఇది ఆరకుండా అలానే ఉండిపోతే !

ఒక్క క్షణంపాటు ఊగిసలాడిన హృదయాన్ని చిక్కబట్టుకుంది. మూర్తి కేవలం తన మేనబావ మాత్రమే. తమ యిద్దరికీ మధ్య మిగలవలసింది కేవలం చిన్ననాటి స్నేహం మాత్రమే. మన స్సును ఇష్టం వచ్చినట్లు ఆడనిచ్చి, సాంసారిక బంధాలను శిథిలం చేయడం తాను చేయవలసిన పనికాదు. దృఢ మైన నిశ్చయంతో, భర్తమీద అలిగి పుట్టింటికి పారిపోయిన లక్ష్మికి ఉత్తరం రాయడానికి పూనుకున్నది.

3

అప్పుడే వరండాలోకి వచ్చింది లక్ష్మి. ఆ వేళకు అక్కడ కనీసం ఒక అరగంటసేపన్నా నిలబడడం దిన చర్యలో భాగంగా మారిపోయింది. తాను వచ్చి మూడు నెలలు దాటినా మూర్తి నుండి ఉత్తరంలేదు. రాధ ఊరికి వెళ్ళి పోయి ఉండవచ్చు. తన కాపురంలో చిచ్చు పెట్టిన రాధ ! అంత అందమైన అమ్మాయి ఆంతర్యంలో అల్పత్వం ఎలా

చోటుచేసుకుందో! స్వపర భేదం లేకుండా, అన్నీ మనవే అనుకునేవారికి ఎవరేం చెప్పగలరని! మానవత్వపు కనీస ధర్మాలనన్నా పాటించనివారికి సలహాలు పనికిరావు. లక్ష్మికి రాధమీద కంటే మూర్తిమీద కక్ష పెరిగిపో సాగింది. ఈ సకల సృష్టిలో తనదీ అని చెప్పుకోగల సజీవ వస్తువు మూర్తి ఒక్కడే. ప్రసిద్ధిచెందిన దేవాలయం లోని దైవంకంటే అతడు తనకు ఎక్కువ. తన ఒక్కదానికే సొంత మనుకున్న పెన్నిధిమీద మరొకరికి ఎటువంటి హక్కయినా ఉండడాన్ని తా నెలా సహించగలదు? ఈ అభిప్రాయాన్ని మూర్తికి తాను రకరకాలుగా వ్యక్తంచేసింది. కాని వాటికి ఏ విలువా ఇవ్వకుండా, రాధవైపుకు తిరిగిపోయిన ఆయన్ని ఏమనాలో, ఎలా సాధించాలో తనకు తెలియడంలేదు. ఆవేశంతో, కక్షతో, ప్రతీకార వాంఛతో, ఎదుట నిలిచి ఏమీ చెయ్యలేనన్న నిస్సహాయతతో, ఇక్కడికి వచ్చేసిందిగాని, అందువల్ల ఏం తీరినట్లు? ఒక్క విషయం మాత్రం పూర్తిగా తన అనుభవంలోకి వస్తున్నది. మూర్తిని, తన అభిమానం దెబ్బతికుండా, తనవైపుకు మళ్ళించుకునే దారి కనబడడంలేదు. ఆలోచించిన కొద్దీ తా నెంత చేతగానిదో తెలిసి వస్తున్నది. తెలిసినకొద్దీ చెప్పలేని నీరసం తన్ను చుట్టుకుంటూ తన బ్రతుకు సార్ధక్యాన్నే ప్రశ్నిస్తూంది.

ఎదురు చూస్తున్నందుకు ఫలితంగా పోస్టువాడు ఓ ఉత్తరం అందించాడు. పైనరాత మూర్తిదికాదు. ఎవరిదీ ఉత్తరం! "ప్రియమైన లక్ష్మి!"

దెబ్బతిన్నట్లైంది. రాధ ఉత్తరం! తన జీవితంలో చిచ్చుపెట్టిన రాధ! అసహ్యం మనస్సును కుదిపేసింది. ఏం వ్రాస్తుంది? నీ మొగుణ్ణి నీకక్కుండా చేశాను చూశావా అంటూ విజయగర్వం వలకబోస్తుందా? కాస్సేపు ఆ ఉత్తరం చదవకూడదనే అనుకుంది లక్ష్మి. కాని ఎలా? మూర్తిని గురించి ఏం వ్రాస్తుందో! అయినా చేతికొచ్చిన ఉత్తరాన్ని ఎంత కసి ఉంటే మాత్రం చదవకుండా ఎవరు ముక్కలు చేస్తారు?

ప్రియమైన లక్ష్మి!

కొన్నాళ్ళపాటు నీ మనస్సును క్షోభ పెట్టిన రాధనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. మొదటినుండీ నీ భర్తమీద నాకు మోజు లేదు. ఉంటే, అతడు నీ జీవితంలో ప్రవేశించే వీలుండే దంటావా? అతడు నాకు బాల్య స్నేహితుడు. నా మేనబావ. మా యిద్దరిమధ్యా ఉన్న అనుబంధం ఆ హద్దుల్ని ఎప్పుడైనా దాటుతుందని ఎందుకనుకున్నావో నువ్వు.

నీకు అతడే లోకం. నిజమే. అతని కూడా నువ్వే నాదీ అనిపించుకోగల సజీవ వస్తువువు. ఈ అనుబంధం ఏ ఆలుమగల మధ్యనైనా ఉండవలసిందే. కాని నీకు తెలీకుండానే నీ భర్తకు చిరాకు

తెప్పించే స్వార్థబుద్ధిని పెంచుకుంటున్నావు. పిచ్చిదానా! ఆత్మార్పణవల్ల, అనల్పమైన ఆకర్షణ వల్ల, మగవాడిని నీ చుట్టూ తిప్పుకోగలగాలిగాని అరిచీ హక్కులు ర్థయించీ కాదు. ఆ విషయాన్ని నీకు రుజువుచెయ్యాలనే నీపట్ల నిష్కారుణంగా ప్రవర్తింపవలసివచ్చింది. నీ మీద చిరాకు తెచ్చుకుని, తిరుగుబాటు చెయ్యాలనుకున్న మూర్తి, నన్ను సాధనంగా వాడుకుందామనుకుని నా చేతుల్లో పూర్తిగా ఓడిపోయాడనుకున్నాను. కాని నిన్న అతనిదగ్గరనుండి వచ్చిన ఉత్తరం చూశాక అతని ఓటమి తాత్కాలికమైందేనని గ్రహించగలిగాను. లక్ష్మీ! నువ్వతని జీవితానివీ, జీవిత ధ్యేయానివిన్నీ. ఇప్పటికీ ఎప్పటికీ అతనికి నీపట్ల ఉన్న ఈ భావం మారకుండా ఉండడానికి ప్రయత్నించు. నీ స్వార్థాన్ని కొంత తగ్గించుకో. ఇలా చెప్తున్నందుకు నామీద కోపం తెచ్చుకోకు. మీ ఇద్దరి మధ్యా అనుబంధం దృఢంగా ఉండాలని సర్వదా కాంక్షించే నీ సోదరి,

రాధ.''

ఉత్తరం పూర్తిచేశాక కూడా, లక్ష్మికి రాధమీద ఇదివరకేర్పడ్డ భావాలలో పెద్దగా ఏ మార్పూ కలగలేదు. ఆవిడ ఊహల్లో ఎక్కడా రాధకు చెప్పుకోదగ్గ ఎటువంటి స్థానమూ కనిపించలేదు. అవన్నీ కేవలం మూర్తి చుట్టూ సాలెగూడుకుమల్లే అల్లుకుపోసాగినయ్. మూర్తి అందరికి మల్లే ఉత్త మగవాడు పురుష సహజమైన బలహీనతలకు లొంగిపోవడం, పెద్ద అపరాధం కాదు కాబోలు. తానే తన దృక్పథం మార్చుకోవాలి. లేకపోతే ఈ వివాదాలు, వియోగాలూ తానింక ఏమాత్రమూ భరించే స్థితిలో లేదు. ఏ జీవితానికయినా రాజీ పడవలసిన అవసరం రావచ్చు. తనవాడనుకున్న మూర్తితో రాజీపడడంలో చిన్నతనమేముంది? ఇక వెయ్యిమంది రాధలు వచ్చినా తమ ఇద్దరి మధ్యా కలతలు సృష్టించలేరని తాను నిరూపిస్తుంది. ఇక ఒక్కనాటికీ తాను మూర్తిని విడిచిపెట్టి అభిమానంతో ఎక్కడికీ పరిగెత్తిపోదు – ఈ ఊహతో లక్ష్మి మనస్సు తేలికపడింది. ఇన్నాళ్ళుగా అణచిపెట్టబడ్డ ప్రేమ పొంగి మనసంతా పరవశింప సాగింది. కాగితమూ కలమూ వెతుక్కోడానికి, ఇంట్లోకి ఇంచుమించు పరుగులు పెడ్తున్నట్టే నడిచింది లక్ష్మి.

4

మరి వారం రోజులనుండీ రాధను తలుచుకోకుండా, ఒక్కక్షణం గడవడం లేదు మూర్తికి. మంచంమీద వెల్లికిలా పడుకుని ఇంటికప్పువేపు నిరాసక్తంగా చూస్తున్నాడు. రాధకు తను ఉత్తరం వ్రాసి వారం రోజులైంది. అయినా ఆవిడ జవాబెందుకు వ్రాస్తుంది? అసలే



మని వ్రాస్తుందని: సరిగ్గా నీలాగే నేనూ నీ ధ్యాసతో కాలాన్ని నిర్దాక్షిణ్యంగా చంపుతున్నానని వ్రాస్తుందా: నిజంగానే ఆ ఒక్కమాట రాధ రాయగలిగితే, ఇక నీ ప్రపంచంలో తాను కోరదగ్గ దేముందని: వెర్రితనం: రాధను మనసారా తనతో మాట్లాడించగల శక్తి ఏదీ తనకున్నట్లు లేదు. అట్లాగే లక్ష్మీపట్టుదల విడగొట్టే సాధనం కూడా తనదగ్గర లేదు. ఉందేమోనని సమాధానపడబోయేంతలోగా గుండెలో పీటవెట్టుకుని కూర్చున్న రాధ బొమ్మ పగలబడి నవ్వుతున్నట్లు అనుభూతి కలుగుతోంది. అది ప్రాణాల్ని కడబట్టించే నవ్వు: తన జీవితంతో నిర్దాక్షిణ్యంగా ఆడుకునే నవ్వు: ఆ రాధను కొనవేలితో తాకనైనా తాకే ధైర్యం లేదు తనకు, జీవితమనే పెద్ద కలలో చిక్కుకుని, తన్నుకుంటున్న చేపలాంటి వాడు తను. తన చేతగానితనం నరనరాల్లోనూ అనుక్షణమూ నీరసాన్ని నింపుతోంది.

మనస్సులో దిగులు సన్నగా కురుస్తున్నట్లు బయట వాన మొదలైంది. తన మంచం పక్కనున్న కిటికీనుంచి గాలి, చినుకుల్ని తెరలు తెరలుగా మోసుకొచ్చి మీద చిలకరిస్తోంది. మంచం మీదనుండి లేవాలనిగానీ, కిటికీ మూయ్యాలనిగానీ అనిపించడం లేదు. అట్లాగే తడుస్తూ, తడిసిన మనస్సు బరువుకు కుంగిపోతూ, కళ్ళు గట్టిగా మూసుకున్నాడు మూర్తి. రెండు కళ్ళ మధ్యా రెండు బొమ్మలు మార్చి మార్చి చండప్రచండంగా కదను తొక్కుతున్నయ్ ఈ రెంటిలో ఏది బల

మైందో, దేనికి ఆ క్షణాన ఆకర్షణ ఎక్కువగా ఉందో మూర్తికి తెలుసు. తన దేహంలోనూ, ప్రాణంలోనూ అంతర్గతంగా ఉన్న అను ఏ పేరుతో సరి నడకలు నడుస్తున్నదో ఖచ్చితంగా తెలుసు.

పోస్ట్ అన్న కేకతోపాటు, ఓ ఉత్తరం మంచం దగ్గరికి విసురుగా వచ్చి పడ్డది. మూర్తి గుండె ఆ చప్పుడుతో జత కలుపుతూ, ఒక్కసారిగా ఉవ్వెత్తుగా లేచిన కెరటానికిమల్లే మిడిసిపడ్డట్లయింది. గుండె నిండా ధ్వనించే రాధ, రాధ అనే శబ్దం తన చెవులకే వింతగా వినిపించసాగింది. రాధ మీద ఇంత ఆరాధనేమిటి? అయినా దీనికి ఫలితమేమిటి? ఈ జన్మలో తీరడానికి వీలులేని కాంక్ష పేరుకుని అశాంతిని కలిగించడం తప్ప!— ఉత్తరాన్ని ప్రియురాల్ని తీసుకున్నంత మెత్తగా చేతుల్లోకి తీసుకున్నాడు. ఎన్నాళ్ళనుండో ఎదురుచూస్తున్నాడు దీనికోసం! ఏమని రాస్తుంది రాధ!

కాని, కాని, పైన దస్తూరీ రాధది కాదు. లక్ష్మిది. తన లక్ష్మిదే! చిత్రంగా గుండెలో వెనకటి ఆరాటం క్రమంగా తగ్గిపోనారంభించింది. మనస్సులో ఇంతవరకూ ఎగసిపడే మంటలు ఆరిపోతూ, క్రమంగా చల్లదనం చోటుచేసుకోసాగింది గాలి వాన వెలిశాక తేరుకునే పెద్ద చెరువుకు మల్లే హృదయమంతా క్రమంగా, శాంతంగా మారిపోసాగింది. ఈ ప్రశాంతి మూర్తికి రుచించకపోయినా చెయ్యిదగ్గ దేమీలేదు తీరని కోరికవల్ల తపనతో ఎంత ఆరాటపడినా తాను ఒక్క సత్యాన్ని కాదనడానికి వీలు లేదు. రాధకూ తనకూ మధ్యనున్న దూరం మరో జన్మ. ఈజన్మలో ఇద్దరూ ఎన్నటికీ కలవలేని రైలుపట్టాలు. నిప్పులాంటి ఈ నిజం మనస్సును కాలుస్తుండగా గుండె చిక్కబట్టుకుని, పెదవులు బిగించి, ఏ విధమైన చాంచల్యమూ చేరకుండా ఉండేట్లు విశ్వప్రయత్నం చేస్తూ ఉత్తరం విప్పాడు మూర్తి.

అక్షరాల వెంబడి చూపులు వేగంగా పరిగెత్తుతున్నకొద్దీ మూడు నెల్లనుండీ పేరుకున్న దిగులు పొరలు విరిసి మూర్తి కళ్ళు స్వచ్ఛంగా మెరవసాగాయి.